క్లుప్తంగా

నాలుగు గ్రామాల్లో నేడు 'రచ్చబండ'

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి, మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట గ్రామాల్లో మంగళవారం 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కోసం చేపట్టనున్న ఈ కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ క్లబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హనుమంతు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలు, వాటి పర్యవసానాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే రామ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని వివిధ ట్రేడ్‌లలో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బద్రీనాథ్ తెలిపారు. మొదటి నాలుగు విడతల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఫైర్ అధికారులు

యాడికి: బాణసంచా విక్రయించే దుకాణదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసే స్థానిక ఉన్నత పాఠశాల, మండలంలోని రాయలచెరువు గ్రామంలో స్థలాన్ని సీఐ ఈరన్న, ఫైర్ ఆఫీసర్ మోహన్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు బాణసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. సేల్ టాక్స్, అగ్నిమాపక, పోలీసుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. బాణసంచాను అధిక ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిష్టప్ప, బాణసంచా దుకాణదారులు పాల్గొన్నారు.


'ఆరోగ్య శ్రీ'కి నిధులు మంజూరు చేయండి



తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శింగనమల(నార్పల): ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు కేటాయించకపోవడంతో, ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించడం లేదన్నారు. దీంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చాపల రామాంజి, సుధాకర్, పెద్ద పెద్దయ్య, నవీన్, నరసింహ, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా నాగరాగిణి



తాడిపత్రి రూరల్: తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా భూమా నాగరాగిణి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులతో కలసి ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యానికి బ్రాండ్.. బాబు

- సూత్రధారులు, పాత్రధారులు టీడీపీ వారే
- ప్రభుత్వంపై మండిపడ్డ మాజీ మంత్రి సాకే శైలజానాథ్



బుక్కరాయసముద్రంలో ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, నాయకులు



గుత్తిలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బీకేఎస్‌లో ఎక్సైజ్ సీఐ సునీతరాణికి వినతిపత్రం అందజేస్తున్న సాకే శైలజానాథ్, నాయకులు



గుత్తిలో ఎక్సైజ్ సీఐ ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

శింగనమల: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, విక్రయానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శైలజానాథ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా సింగిల్‌విండో కార్యాలయంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి , నివాళులర్పించారు. అక్కడి నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శైలజానాథ్ మాట్లాడుతూ .. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రంలో పాలన కొనసాగలేదని, కేవలం దోచుకోవడమే వారి పనిగా మారిందన్నారు. గతంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపి నాణ్యమైన మద్యంను విక్రయించిదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని రద్దు చేసి, తమ మాఫియాకు మద్యం దుకాణాలిచ్చి, నకిలీ మద్యం తయారు చేయించి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. మద్యం దుకాణాల పక్కనే పర్మిట్ రూంలకు అనుమతిచ్చి, దోచుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన బెల్టు షాపులు వెలిశాయని, నకిలీ మద్యం అందించి, ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నారని విమర్శించారు. నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సునీతరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీలు నీలం భాస్కర్, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, మండల కన్వీనర్లు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పూల ప్రసాద్, ఖాదర్‌వలి, మహేశ్వర్ రెడ్డి, శివశంకర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాలు, ముసలన్న, ప్రతాప్‌రెడ్డి, పసుపులేటి పద్మావతి, సర్పంచ్ పార్వతి, చికెన్ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం, డీప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

గుత్తి: గుత్తిలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం కదంతొక్కాయి. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా జై జగన్, జై వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ కుమార్ యాదవ్ మాట్లాడారు. కల్తీ మద్యం, బెల్టు షాపులకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలన్నారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యం తక్కువ ధరలకు ఇస్తామని చంద్రబాబు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం, ఊరు వాడా మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేయించారన్నారు. పాలన గాలికొదిలేసి, నకిలీ మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, జిల్లా నాయకుడు సుభాష్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ సీవీ రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్ మాట్లాడారు. నకిలీ మద్యం, మద్యం బెల్టు షాపులు ఊరూరా పెట్టి డబ్బు సంపాదనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. త్వరలోనే ప్రజలు రోడ్లపైకి వచ్చి కూటమి నాయకులకు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం నకిలీ మద్యం, మద్యం బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల మాజీ కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, మాజీ అధ్యక్షురాలు శ్రీదేవి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ, పార్టీ క్రిస్టియన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపీబాబు,మహిళా నాయకురాళ్లు కళ్యాణి, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, డాక్టర్ శాంతి ప్రియ, సుగుణమ్మ,, కౌన్సిలర్లు వాల్మీకి శివ, కేవీ రమణ, వరదరాజులు, నరేష్, మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షులు షఫి, పట్టణ ప్రచార కార్యదర్శి వెల్డింగ్ రవూఫ్, జిల్లా నాయకులు రంగస్వామి, రామరంగారెడ్డి, భీమలింగ, రామ సుబ్బారెడ్డి, హరినాథ్ రెడ్డి,ఫయాజ్, మండల నాయకులు హరి, తోళ్లషాపు హరి, పవన్, ఇబ్రహీం, పులెప్ప, రంగన్న, హరినాథ్ రెడ్డి, దేవా, రఘు,బ్రహ్మ కుమార్, మధు సూదన్ రెడ్డి, కటిక అన్వర్, దాదా పీర్, నూర్ నాయక్, మెకానిక్ రాము, మహమ్మద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కూటమి కుట్రలకు చెక్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

శింగనమల: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే కూటమి కుట్రలకు చెక్ పెట్టేందుకు కోటి సంతకాల ఉద్యమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని మాజీ మంత్రి , నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఉల్లికంటిపల్లి, ఉల్లికల్లు, కొరివిపల్లి, అలంకరాయునిపేట, జూలకాల్వ, పి.జలాలపురం గ్రామాల్లో కోటి సంతకాల సేకరణపై రచ్చబండ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే శైలజానాథ్ మాట్లాడుతూ ప్రజలకు వైద్య విద్య అందించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకువచ్చి, ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. మిగిలిన కళాశాలలు కొన్ని నిర్మాణ దశలో, మరి కొన్ని పూర్తయ్యాయన్నారు. ఇవన్నీ పూర్తయితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించుకుందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలోను కమిటీలు వేయాలని, అప్పుడే పార్టీ మరింత బలపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, పరంధామ రెడ్డి, కోనారెడ్డి, వెంకటనారాయణ, శివమ్మ, శంకుతలమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, గోపీ యాదవ్, వీరాంజనేయులు, రామక్రిష్టారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధితోనే గ్రామాభివృద్ధి



కలశ ప్రతిష్ట, హనుమద్ దీక్షల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం ఎంత అభివృద్ధి చెందుతుందో అంతే అభివృద్ధి గ్రామంలోనూ జరుగుతుందని, గ్రామస్తులు సహకరించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఈఓ ఎం.విజయరాజు సూచించారు. ఈనెల 29, 30, 31న ఆలయంలో కలశ ప్రతిష్ట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో సోమవారం ఆలయంలో గ్రామస్తులు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే క్రమంలో భాగంగా దాదాపు రూ. 15 కోట్ల వ్యయంతో అలయంలో పలురకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఆలయంలో కలశ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహణ అనంతరమే అభివృద్ధి పనులను ప్రారంభించాలని చిన్న జీయర్ స్వామి సూచించిన నేపథ్యంలో ఈ నెల 29 నుంచి 31 వరకూ కలశ ప్రతిష్ట పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రతి కుటుంబం బంధుమిత్రులను ఆహ్వానించి, ప్రతి ఇంట్లోనూ ఆడబిడ్డలకు పసుపు, కుంకుమ అందజేస్తూ పండుగను జరుపుకోవాలని సూచించారు. అనంతరం వారు సిబ్బందితో కలసి కలశ ప్రతిష్ట, హనుమద్ దీక్షలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

మురికి కూపంలో ఎలా నివసించాలి?



రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు

గుంతకల్లుటౌన్: మురికి కూపంలో ఎలా నివసించాలి? అనారోగ్యాల బారిన పడుతున్నా మీరు పట్టించుకోరా? అని 11వ వార్డు తిలక్‌నగర్ వాసులు మున్సిపల్ ఇంజినీర్లను నిలదీశారు. డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయించడంలో ఇంజినీర్ల నిర్లక్ష్య వైఖరికి నిరసిస్తూ కాలనీవాసులు సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. టూటౌన్ పోలీసులు జోక్యం చేసుకుని ఎంఈఈ ఇంతియాజ్‌తో సమస్యపై చర్చించారు. కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో ప్రైవేట్ స్థలంలో మురుగునీరు పారేదని, అయితే ఆ స్థలం వారు గోడ నిర్మించడంతో మూడు కాలనీల మురుగు మా ఇళ్లముందు వచ్చి నిలుస్తోందన్నారు. తీవ్రమైన దుర్వాసన, విపరీతమైన దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నా మీకు చీమకుట్టినట్లుగా కూడా లేదా అంటూ ప్రజలు అధికారులపై మండిపడ్డారు. దీంతో ఎంఈ ఇంతియాజ్, డీఈ షబానా, ఏఈ ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కాలనీలో పర్యటించారు. రూ.9.50 లక్షలతో మంజూరైన డ్రైనేజీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నల్లబ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



యల్లనూరు పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో వైద్యసిబ్బంది నిరసన



ఎద్దులపల్లి పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో సిబ్బంది..

యల్లనూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్లు లోకేష్‌కుమార్, శివసాయిలు తమ న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న సమ్మెకి యల్లనూరు పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలతో సంఘీభావం తెలిపారు. పీహెచ్‌సీ వద్ద, నిట్టూరు సబ్‌సెంటర్ వద్ద వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్లు హాజీవలి, నూర్‌బీ, సీనియర్ అసిస్టెంట్ సుస్మితతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి పీహెచ్‌సీలో సోమవారం ఆరోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. డిమాండ్ల సాధన కోసం వైద్యాధికారులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ యువకుడి మృతి

గార్లదిన్నె: మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్ యువకుడు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిహార్ చెందిన జగదీష్ (28), మరో యువకుడు కనంపల్లిలోని పప్పుల ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. వారు ద్విచక్ర వాహనాల్లో గార్లదిన్నెకు వచ్చి.. పని ముగించుకుని కనంపల్లికి బయలుదేరారు. తిమ్మంపేట సమీపంలోకి రాగానే రాయదుర్గానికి చెందిన మణికంఠ, నందకిశోర్ మరో ద్విచక్రవాహనంలో వస్తూ ఢీకొన్నారు. ఘటనలో జగదీష్ మృతి చెందగా, నందకిశోర్, మణి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

నిట్టూరు సబ్ సెంటర్ తనిఖీ



సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా క్వాలిటీ మేనేజర్ స్టీఫెన్

యల్లనూరు: మండలంలోని నిట్టూరు సబ్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఎఎస్) జిల్లా క్వాలిటీ మేనేజర్ స్టీఫెన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా గతంలో రోగులకు వైద్య సేవలు ఎలా అందాయి?, ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు? తదితర వాటిపై సబ్ సెంటర్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఢిల్లీ బృందం జూమ్ మీటింగ్ ద్వారా సమస్యలపై ఆరా తీస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యుడు లోకేష్‌కుమార్, సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మీరాజ్యం, సుప్రియ, శృతి, ఏఎన్ఎంలు ఎస్తేరు రాణి, కాశీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఫ్లోర్ క్లీనర్ మృతి

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లి సమీపంలో ఉన్న సైన్స్ డిగ్రీ కాలేజీలో ఫ్లోర్ క్లీనర్ రాజు (40) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. చింతలాయపల్లికి చెందిన రాజుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయం అదానీ సిమెంట్ కర్మాగారం ఆవరణలో ఉన్న సైన్స్ కాలేజీకి వెళ్లిన రామసుబ్బయ్యకు సాయంత్రం ఛాతీలో నొప్పి రావటంతో అక్కడే పడిపోయాడు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు సిమెంట్ కర్మాగార యాజమాన్యానికి తెలపడంతో అతడిని తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించారు. రాజు అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో చింతలాయపల్లె గ్రామస్తులు రాజు మృతదేహాన్ని రాత్రి 10 గంటలకు తీసుకువచ్చి ఆదాని సిమెంట్ కర్మాగారం ఎదుట నిరసన తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణ





అమ్మవారికి సమర్పించేందుకు బోనాలు మోసుకెళ్తున్న బీకేఎస్ గ్రామస్తులు, అలంకరణలో పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం దగ్గర వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు ఏడో వార్షికోత్సవం సందర్భంగా బోనాల ఉత్సవం నిర్వహించారు. ఆలయాన్ని ఎంతో సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మండల కేంద్రంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాన్ని ఎత్తుకుని వచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉరుముల వాళ్ల డప్పు శబ్దాలు, పెద్దమ్మ తల్లి పాటలు గ్రామంలో మార్మోగాయి. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, ముసలమ్మ దేవత వంశస్తులు సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ, గ్రామ ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

పెద్దవడుగూరు: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అనంతపురం జిల్లా వాష్ కో ఆర్డినేటర్ లక్ష్మీదేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఏపీ మాస్ ఆధ్వర్యంలో నీరు పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వీఓఏలు, సీసీ ప్రకాష్ రెడ్డి, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

మూర్ఛతో కుప్పకూలిన వ్యక్తి

గుత్తి: గుత్తి శివారులోని ఇంటర్ సిటీ డెమో రైల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మూర్ఛవ్యాధితో కుప్పకూలి కిందపడ్డాడు. ఫిర్యాదు చేసినా జీఆర్‌పీ పోలీసులు స్పందించలేదు.108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా రాలేదు. దీంతో స్థానికులే అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడి వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఇద్దరికి రిమాండ్

యాడికి: మండలంలోని వెంగన్నపల్లిలో ఘర్షణ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. ఈ నెల 8న విశ్వనాథ్, లక్ష్మీదేవి కుటుంబాలకు జరిగిన ఘర్షణలో పోలీసులు విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు నారాయణ స్వామి, నవీన్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కాగా సోమవారం నారాయణస్వామి, నవీన్‌ను తాడిపత్రి కోర్టుకు తరలించగా జడ్జి రిమాండుకు పంపారు.

మహిళపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో సోమవారం లావణ్య అనే మహిళపై భూలక్ష్మి దాడి చేసి గాయపరిచింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లావణ్య భర్త వెంకటేష్ ఇంటికి కొద్ది దూరంలో ఉన్న భూలక్ష్మి ఇంటి వద్ద ఉన్నాడు. లావణ్య అటుగా వెళ్తూ భూలక్ష్మితో వాగ్వాదం చేసుకుంది. దీంతో మాటామాటా పెరిగి లావణ్యపై భూలక్ష్మి విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచింది. గాయపడిన లావణ్యను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో లింగమయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన రంగస్వామి దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగమయ్య మూడు రోజుల క్రితం రంగస్వామికి రూ.6 వేలు ఇచ్చాడు. సోమవారం లింగమయ్య డబ్బు తిరిగి ఇవ్వాలని రంగస్వామిని కోరాడు. అయితే రంగస్వామి డబ్బు తిరిగి ఇవ్వకపోగా.. తాను ఎలాంటి డబ్బు బాకీ లేనని బుకాయించాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సహనం కోల్పోయిన రంగస్వామి ఇనుప రాడ్‌తో లింగమయ్యపై దాడి చేసి గాయపరిచాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి సామూహిక దీక్షలు

గుంతకల్లు: పట్టణంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బీ.గోవిందు, పట్టణ అధ్యక్షుడు గోపీనాథ్‌డు తెలిపారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టే సామూహిక దీక్షలకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, మేధావులు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.మహేష్, ఈశ్వరయ్య, దేవేంద్ర, వెంకట్‌నాయక్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఆర్టీటీ కాలనీలో సోమవారం మద్యం మత్తులో భార్య సెల్వర్‌పై భర్త హుస్సేన్‌వలి దాడి చేసి గాయపరిచాడని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో ఆమె చేతికి గాయం చేశాడన్నారు. తీవ్రంగా రక్త స్రావం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేశామన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

తాడిపత్రి రూరల్/గుంతకల్లుటౌన్/గుత్తి/యాడికి: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై సోమవారం తాడిపత్రి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ శివరామక్రిష్ణ, రిటైల్ మర్చెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు రత్నమయ్య, సభ్యులు, సేల్ ట్యాక్స్, లేబర్‌శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ నయామ్ అహ్మద్, మెప్మా అధికారులు, ఆర్పీలు, వర్తక వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా గుత్తిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో లేబర్ ఆఫీసర్ రవీంద్ర, టూవీలర్ల షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, మెకానిక్ పాల్గొన్నారు. అలాగే యాడికిలో అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు.

దొంగ అరెస్టు

తాడిపత్రి రూరల్: పిక్ ప్యాకెటర్‌ను సోమవారం అరెస్టు చేశామని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకన్న తాడిపత్రికి రాగా పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన వెంకటేష్ అతడి డ్రాయర్ జేబు కత్తిరించి రూ.8 వేలు దొంగలించి పరారయ్యాడు. పరిసర ప్రాంతాల్లో గాలించి నిందితున్ని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అప్పు చెల్లించే విషయంలో గొడవ

యల్లనూరు: అప్పు చెల్లించే విషయంలో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వివాదం పరస్పర ఘర్షణకు దారి తీసింది. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరులోని పాతపేటకు చెందిన బోయ యర్రప్ప వద్ద నుంచి రూ. 1.20 లక్షలను వద్దే అంజన్‌నారాయణ అప్పుగా తీసుకున్నాడు. తిరిగి రూ.50 వేలు చెల్లించాడు. బకాయి ఉన్న రూ.70వేలు చెల్లించాలంటూ ఆదివారం రాత్రి అంజన్‌నారాయణ ఇంటి వద్దకెళ్లి యర్రప్ప, ఓబులేసు నిలదీశారు. ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. చుట్టుపక్కల వారు కల్పించుకున్నా ఫలితం లేకపోయింది. అంజన్‌నారాయణ, ప్రతాప్ దాడికి పాల్పడ్డారని యర్రప్ప, ఓబులేసు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజినేయరెడ్డి తెలిపారు.